క్లుప్తంగా

బార్ అసోసియేషన్ సభ్యులకు సన్మానం



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: నూతనంగా ఎన్నికైన షాద్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యులను ఆదివారం పట్టణంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కానుగు మదన్‌మోహన్, కోశాధికారి చెక్కల శ్రీనివాసమూర్తిలను ముదిరాజ్ సంఘం నేతలు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు బాబయ్య, రాములు, వెంకటేశ్, అంతయ్య, శ్రీధర్, బాల్‌రాజ్, శ్రీశైలం, తిరుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి ఘన సన్మానం



సత్యనారాయణచారిని సన్మానిస్తున్న నల్లా రాధాకృష్ణ, విమలక్క

చేవెళ్ల: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో అల్లవాడ ఎంపీటీసీ కమ్మరి సత్యనారాయణచారికి ఘన సన్మానం చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇటీవల తిరుపతిలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అల్లవాడ ఎంపీటీసీ కమ్మరి సత్యనారాయణచారి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఈ సమ్మేళనంలో బీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, అరుణోదయ నాయకురాలు విమలక్క ఆధ్వర్యంలో గజలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీటీసీ సత్యనారాయణ చారి అందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

భాగ్యనగర్ విభాగ్ అధ్యక్షుడు సుధాకర్‌రావు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

షాబాద్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించగలరని భాగ్యనగర్ విభాగ్ అధ్యక్షుడు, భవనదాత వెలగపూడి సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల 29వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరమానంద చన్నల్ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు, రవీంద్ర శర్మ, విభాగ్ కార్యదర్శులు హాజరయ్యారు. విద్యార్థులు వివిధ రకాల వేషాధారణలో నృత్యాలు చేసి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ శైజల ఆగిరెడ్డి, దశరథరెడ్డి, రమేష్, ఎంపీటీసీ అశోక్, రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, స్థానిక కమిటీ సభ్యులు గోపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, రమేష్,నారాయణ తదితరులున్నారు.

ధ్యానంతో ఎన్నో ప్రయోజనాలు

ధ్యాన ప్రచారకర్త బాలకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న బాలకృష్ణారెడ్డి

కొందుర్గు: ధ్యానంతో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచారకర్త బాలకృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం కొందుర్గు మండలంలోని ఉమ్మెంత్యాల, లాలాపేట, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వనంపల్లి, తూంపల్లి, తుమ్మలపల్లి, లచ్చంపేట తదితర గ్రామాల్లో ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎవరి వయస్సు ఎంత ఉంటే అన్ని నిముషాల పాటు శ్వాస మీద ధ్యాస పెట్టి ప్రతి నిత్యం ధ్యానం చేస్తే మనిషి పూర్తి ఆరోగ్యంగా ఉంటాడన్నారు. తలనొప్పి, క్యాన్సర్ తదితర అన్ని రుగ్మతలు దరిచేరవని వివరించారు. ధ్యానం చేయడం దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల మానసికంగా ప్రశాంతంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయ రెడ్డి, పిరమిడ్ సంస్థ సభ్యులు నవీన్, శైలజ, వెంకటలక్ష్మి, అంజయ్య, శ్రీనివాసు, రాములు పాల్గొన్నారు.

నేటి నుంచి ‘పది’ పరీక్షలు

- షాద్‌నగర్‌లో 19 పరీక్షా కేంద్రాలు
- నియోజకవర్గంలో పరీక్షలు రాయనున్న 4,395 మంది విద్యార్థులు
- చేవెళ్లలో 3,787 మంది..
- సెంటర్ల వద్ద 144సెక్షన్ అమలు



షాద్‌నగర్‌లోని పదవతరగతి పరీక్షా కేంద్రం

షాద్‌నగర్: పదవ తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటలకు పరీక్షలు నిర్వహించనున్నారు.

పరీక్షా కేంద్రాల ఏర్పాటు

షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో మొత్తం 4395మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షకు హాజరు కానున్నారు. 19 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారని అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులకు నీటి వసతి, పరీక్ష రాసేందుకు టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే, ప్రతి పరీక్షా కేంద్రం వద్ద విధిగా ఏఎన్‌ఎంను నియమించారు. అన్ని తరగతి గదుల్లో విధిగా వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. నిమిషం నిబంధనపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయలేదని అధికారులు తెలిపారు.

మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు

మాస్ కాపీయింగ్ జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పరీక్షల్లో జంబ్లింగ్ పద్ధతిని అవలంబిస్తున్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పరీక్షల్లో సహకరించకుండా ప్రతీ పరీక్షకు ఇతర సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లను నియమించనున్నారు. అదేవిధంగా ఓ పాఠశాలకు సంబంధించిన విద్యార్థులను అదే పాఠశాలలో పరీక్ష రాయకుండా ఇతర పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాసే విధంగా జంబ్లింగ్ పద్ధతిని పాటించనున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సిబ్బంది సెల్‌ఫోన్‌లను తీసుకురాకుండా నిషేధించినట్లు అధికారులు తెలిపారు.

చేవెళ్లలో 21 పరీక్ష కేంద్రాలు

చేవెళ్ల: నేటి నుంచి పదవ తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు రాయనున్నారు. ఈనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని మండల విద్యాధికారి అక్బర్ తెలిపారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ నాలుగు మండలాలకు సంబంధించి మొత్తం 3787 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరువుతుండగా, 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎంపిక చేసిన అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. చేవెళ్ల మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో 720 మంది విద్యార్థులు, శంకర్‌పల్లిలో ఆరు పరీక్ష కేంద్రాల్లో 1130మంది, మొయినాబాద్‌లో ఆరు పరీక్ష కేంద్రాల్లో 1218 మంది, షాబాద్‌లో నాలుగు పరీక్ష కేంద్రాలో 719 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరువుతున్నట్లు చెప్పారు. ఈ పరీక్షల ఏర్పాట్లుకు గాను 21 మంది చీఫ్ సూపరిటెండెంట్‌లు, 21 మంది డిపార్టుమెంట్ అధికారులు, 212 మంది ఇన్విజిలేటర్లు, ఉపాధ్యాయులు విధుల్లో పాల్గొంటారని చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

“ ఏర్పాట్లు పూర్తి చేశాం



పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు పరీక్షా సమయం కంటే ముందే కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించాం. మాస్‌కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాం.

– శంకర్‌రాథోడ్, ఎంఈఓ, ఫరూఖ్‌నగర్

రూ.70 లక్షలతో కేశవగూడ అభివృద్ధి

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: రూ.70లక్షలతో కేశవగూడ గ్రామ పంచాయతీని అభివృద్ధి చేసినట్లు షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కేశవగూడ గ్రామంలో రూ.10లక్షలతో హెచ్‌ఎండీఏ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ కవిత, ఎంపీటీసీ మధుకర్‌రెడ్డిలతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన కేశవగూడ గ్రామ అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పల్లెను అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జెడ్పీ చైర్మన్ అనితారెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యల సహకారంతో కేశవగూడ గ్రామానికి రూ.70లక్షల నిధులను విడుదల చేయించామని చెప్పారు. ఇందులో రూ.30లక్షలు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, రూ.35 లక్షలు యూజీడీలు, ఇతర పనులకు ఉపయోగించినట్లు తెలిపారు. గ్రామంలోని పనులను దశలవారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సర్పంచ్ కవిత మాట్లాడుతూ...తమ గ్రామానికి ఇంకా రూ.10లక్షల నిధులను విడుదల చేయాలని కోరారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని , ప్రజలకు అవసరమైన పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఒగ్గు రాజయ్య, నాయకులు నర్సింహ్మా, మల్లయ్య, రాందేవ్‌యాదవ్, వార్డు సభ్యులు తదితరులున్నారు.

కురుమ సంఘం గ్రామకమిటీ ఎన్నిక



సురేందర్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడలో కురుమ సంఘం నూతన గ్రామకమిటీని ఆదివారం ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని బీరప్ప స్వామి దేవాలయం ఆవరణలో కురుమ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు జెల్ల శంకరయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించినట్లు సంఘం నాయకులు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సురేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయి కమిటీని త్వరలో ఎన్నుకుంటామని వారు చెప్పారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం సంఘం సభ్యులు నూతన అధ్యక్షుడు సురేందర్, మాజీ అధ్యక్షుడు శంకరయ్యను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందు అశోక్, ఉప సర్పంచ్ శేఖర్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సమానం

డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

చేవెళ్ల: క్రీడల్లో గెలుపోటములు క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో ఆదివారం పట్లోళ్ల ఇంద్రారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగిన ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడుతాయన్నారు. ప్రతి ఏడాది కౌకుంట్ల గ్రామంలో యువత కోసం ఇంద్రారెడ్డి మెమోరియల్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత ఈ టోర్నమెంట్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు 50వేల నగదు, షీల్డ్, రన్నరప్‌కు 25వేల నగదు, షీల్డ్ అందించడం జరుగుతుందని చెప్పారు. ఈనెల 22వ తేదీన టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి మంత్రి సబితారెడ్డి హాజరై విజేతలకు బహుమతుల ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నాగార్జున్‌రెడ్డి, గోపాలక్రిష్ణ, శ్రీను, నిర్వాహకులు మహేశ్, రమేశ్, మాధవ్‌రావు, జె. మహేశ్, అనిల్‌కుమార్, రాకేశ్, ప్రశాంత్, విక్రమ్, గోవర్ధన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో తెలంగాణ నంబర్ వన్

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: అభివృద్ధిలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్, వెలిజర్ల, చిల్కమర్రి, కొండన్నగూడ తదితర గ్రామాలకు చెందిన కార్యకర్తలతో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని బీజేపీ, కాంగ్రెస్ నేతలు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ప్రతి పక్షాల కుట్రలను తిప్పికొట్టేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. ఉద్యోగాల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ, కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడుతున్నారని అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలు కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. సాగు, తాగునీటి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కూడా పూర్తి చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఖాజా ఇద్రీస్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మౌనిక, హరికృష్ణ, నారాయణ కవిత, ఎంఎస్ నట్‌రాజన్, బక్కన్న యాదవ్, నారాయణరెడ్డి, సూర్యప్రకాష్, రాజావరప్రసాద్, వెంకట్‌రెడ్డి, భీష్వరామకృష్ణ, సుష్మారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌యాదవ్



కాంగ్రెస్ విధానాలను ప్రజలకు వివరిస్తున్న ప్రవీణ్‌యాదవ్

కేశంపేట: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి అలుగడ్డ ప్రవీణ్‌యాదవ్ అన్నారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమం ఆదివారం మండలంలోని పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, కొండారెడ్డిపల్లి, కాకునూర్, నిర్దవెల్లి, వేములనర్వ, చింతకుంటపల్లి, సంగెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌యాదవ్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ ఎన్నికలకు వస్తున్నారని వారిని ఓడించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 500లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు ఉచితంగా ఇళ్ల నిర్మించి ఇచ్చిందన్నారు. దళిత, గిరిజన నిరుపేదలకు వ్యవసాయ భూములను పంపిణీ చేసిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘పల్లె పల్లెకూ సీపీఐ జాత’ను విజయవంతం చేయండి

శంకర్‌పల్లి: ‘పల్లె పల్లెకు సీపీఐ జాత’ కార్యక్రమం విజయవంతం చేయాలని సీపీఐ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కె.రామస్వామి, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ప్రభులింగం అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని అతిథిగృహంలో శంకర్‌పల్లి సీపీఐ పార్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. దేశంలోని బీజేపీ మతోన్మాదాన్ని బడుగు, బలహీన వర్గాల ప్రజలపై రుద్దడం సరికాదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తీవ్రంగా పెంచి పేద ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఈ నెల 14వ తేదీ నుంచి మే15వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడుతూ పల్లె, పల్లెకు సీపీఐ జాత కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు చంద్రయ్య, మండల సీపీఐ కార్యదర్శి సుధీర్, నాయకులు సాయి, సయ్యద్ మోదిన్, పర్మయ్య, గంగయ్య, అంతయ్య, మేల్లేష్, అమృత, లక్ష్మీభవాని తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌కు సన్మానం

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన డాక్టర్ టంగుటూరి విజయ్‌కుమార్ నియామకం పట్ల బీజేపీ సీనియర్ నాయకుడు, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు మహేందర్ రెడ్డి ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్‌ను ఆయన నివాసంలో కలుసుకొని పూలమాల, శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించారు. అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ...క్రమశిక్షణతో పార్టీ అభివృద్ధికి పని చేసే నాయకులను పార్టీ అధిష్టానం తప్పనిసరిగా గుర్తిస్తుందన్నారు. నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండే విజయ్‌కుమార్‌ను అసెంబ్లీ కన్వీనర్‌గా నియమించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో వైఎస్సార్ పాలన అందిస్తాం

- హాత్‌సే హాత్ జోడో యాత్రలో శంకర్



ఇంటింటి ప్రచారంలో మహిళతో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: దేశంలో బీజేపీ దుర్మార్గపు పాలన చేస్తుంటే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ రాక్షస పాలన కొనసాగిస్తుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ విమర్శించారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో చేపట్టిన హాత్‌సే హాత్ జోడో పాదయాత్ర కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్ హాజరై గ్రామంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, కూలీలు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. అన్ని వర్గాల ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పాదయాత్రను చేపట్టి గ్రామగ్రామాన తిరిగి ప్రజల కష్టాలను తెలుసుకున్నారని చెప్పారు. రైతుల కష్టాలు తెలిసిన వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తరువాత తొలి సంతకం ఉచిత విద్యుత్‌పైనే పెట్టారని గుర్తు చేశారు. విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్, నిరుపేదలకు ఆరోగ్యశ్రీ పథకం, 108, 104 అంబులెన్స్‌లను తీసుకువచ్చి సుపరిపాలన అందించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ అందించిన ప్రజా సంక్షేమ పాలనను తీసుకువస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌అలీఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, రాంరెడ్డి, కొమ్ముక్రిష్ణ, చంద్రశేఖర్, రఘు, నాగమణి, రజిత, వజ్రమ్మ, రాజు, కృష్ణారెడ్డి, జితేందర్‌రెడ్డి, రాయికల్‌శ్రీనివాస్, చల్లాశ్రీకాంత్‌రెడ్డి, అందెమోహన్, అర్జున్‌లక్ష్మణ్, మల్లయ్య, కృష్ణయ్య, శ్రీశైలం, రాజు, శర్వలింగం, శివ, యూసుఫ్, బుడ్డనర్సింహ్మా, ఎండి.ఆజం, నర్సింలు, అభినవ్, ఆంజనేయులు, అశోక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహబంధానికి ప్రతీక ఇఫ్తార్

బీఆర్‌ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకుడు ఎంఏ మతీన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు ఎంఏ మతీన్, ముస్లింలు

షాబాద్: ఇఫ్తార్ విందులు మతసమరస్యానికి ప్రతీకలని, హిందూ ముస్లింల స్నేహబంధానికి ప్రతీకగా ఇఫ్తార్ విందును జరుపుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎంఏ మతీన్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మసీద్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు. అనంతరం హిందువులు, ముస్లింలు కలిసి ప్రార్థనలు చేసి, ఒకరికొకరు పండ్లు తినిపించుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ముస్లిం మత పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జడల రాజేందర్‌గౌడ్, ముస్లిం సోదరులు సయ్యద్ ఆయూబ్, ముజీబ్, అరీఫ్, యూసుఫ్, రుక్మద్దీన్, తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సాయి, కాలేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీ రామదూత చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సాయి, కాలేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో శ్రీరామదూత ఆశ్రమంలో పేదలకు ఉచిత అన్నదాన, సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి నెల మొదటి ఆదివారం ఆశ్రమంలో శ్రీరామదూతస్వామి వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీ రామదూత చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులున్నారు.

జాతీయ అవార్డుల అందజేత



అవార్డును అందుకుంటున్న స్వాతి బాలీశ్వర్

కేశంపేట: క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేసినందుకు పలువురికి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డులను అందజేశారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి, లేమామిడి, చౌలపల్లి గ్రామాల సర్పంచులు పల్లె స్వాతి బాలీశ్వర్, శ్రీశైలంగౌడ్, వీరేష్‌లకు ఉత్తమ జాతీయ సర్పంచులుగా, కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లె ఆనంద్‌కుమార్ చేసిన సేవలను గుర్తించి జాతీయ సేవారత్న అవార్డులను బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు రాధాకృష్ణ ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అందజేశారు. అవార్డులు అందుకున్న వారు ప్రజలకు మరిన్ని సేవలను అందించాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ కోరారు. జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తున్న వారిని గుర్తించి వారిని సత్కారించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్, మల్లేష్ గౌడ్, రాజు, శ్రీనివాస్, విజేందర్‌రెడ్డి, శేఖర్, కుమారస్వామి, శివకుమార్‌గుప్తా, అనిల్‌కుమార్‌గుప్తా, మచ్చేందర్, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.